

నమస్తే అన్నా : ఇసుకతోట వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

బంగారు కొండవయ్యా.. మా జగన్ మావయ్యా..





కంచరపాలెం వద్ద జనసందోహం (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్

సూరీడే గొడుగు పట్టి.. వచ్చాడే వెన్ను తట్టీ.!



గోపాలపట్నం వద్ద మేమంతా సిద్ధం అంటున్న జనం

- జనజాతరతో హోరెత్తిన విశాఖ నగరం
- అడుగడుగునా నీరా'జనం'.. దారిపొడవునా అలుపెరగని స్వాగతం
- సాగరతీరంలో మార్మోగిన జై జగన్ నినాదం
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం జగన్
- ఎండకు సైతం వెరవని అభిమానం
- పెందుర్తి, పశ్చిమ, ఉత్తర, దక్షిణ, తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లో సాగిన బస్సుయాత్ర
- ఎండాడలో రాత్రి బస



భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థాంక్యూ సీఎం సార్



మండుటెండ.. అయినా భయపడలేదు.. కారుమబ్బులు.. అయినా కదలలేదు.. చిరుచీకట్లు.. అయినా వెరవలేదు.. అదే అభిమానం.. అదే ఆదరణ.. ఓ నాయకుడి జైత్రయాత్రకు విశాఖ నగరం సాక్ష్యంగా నిలిచింది. అభిమానం అంటే ఇలా ఉంటుందా? జనమంతా ఏకమై సంబరం చేస్తే ఇంత సందడిగా ఉంటుందా.? అన్నట్లుగా నగరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర సాగింది. సంక్షేమం, అభివృద్ధితో జనహృదిని గెలుచుకున్న **ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సాగర తీరంలో జన సముద్రం అంబరమంత స్వాగతం పలికింది. జై జగన్ నినాదాలతో సాగర ఘోషను** మించి విశాఖ నగరం ప్రతిధ్వనించింది. బాధలతో కలిసిన వారికి సీఎం జగన్ భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న వారి కన్నీళ్లు తుడిచారు. సంతోషంతో వచ్చిన వారితో సందడి చేశారు. సుమారు 45 కిలోమీటర్ల మేర అభిమానంతో వచ్చిన జనసందోహాన్ని చిరునవ్వుతో పలకరించి.. అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

సాక్షి, విశాఖపట్నం:

జనమే జనం.. పోటెత్తిన అభిమాన ప్రవాహం.. కిక్కిరిసిన రహదారులు.. రోడ్లకిరువైపులా జనం బారులు.. మహిళల హారతులు.. పూల వర్షాలతో కనీవినీ ఎరుగని అఖండ స్వాగతం నడుమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఆదివారం విశాఖ నగరంలో 45 కిలోమీటర్ల మేర సాగింది. సంక్షేమ రథసారథి, పేదల పెన్నిధి, తమకు మంచి చేసిన జననేతను స్వయంగా చూసేందుకు పెద్దల నుంచి పిల్లల దాకా ప్రతి ఒక్కరూ మండుటెండను సైతం లెక్క చేయకుండా వెల్లువలా తరలివచ్చారు. అభిమాన నేతను దగ్గరి నుంచి చూడాలని.. వీలైతే మాట్లాడాలని.. ఒక్క ఫొటో తీసుకోవాలని ఉత్సాహం చూపారు. తన కోసం వేచి చూస్తున్న అక్కచెల్లెమ్మలను, అవ్వాతాతలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి ఆప్యాయంగా పలకరించారు. వారి కష్టాలు తెలుసుకుని 'నేనున్నానంటూ' భరోసా కల్పించారు. ఆదివారం సబ్బవరం మండలం చిన్నయ్యపాలెం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర.. ఎండాడలో ముగిసింది.

పినగాడిలో పోటెత్తిన అభిమానం

పెందుర్తి నియోజకవర్గం పినగాడి జంక్షన్‌లో జాతీయ రహదారి నిండిపోయింది. కాన్వాయ్ కదిలేందుకు కూడా వీలులేకుండా జనం సీఎం జగన్‌కు జేజేలు పలికేందుకు బారులు తీరారు. అభిమానంతో ఉరకలెత్తుతున్న ప్రజలను చూసి బస్సు దిగిన వైఎస్ జగన్.. జనానికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జై జగనన్నా.. దుష్ట చతుష్టయంతో పోరాటానికి మేమంతా సిద్ధమంటూ మహిళలు నినదించారు. అక్కడి నుంచి కాస్త ముందుకు వచ్చిన వెంటనే పినగాడి ప్రజలు సీఎం జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వగ్రామమైన శ్రీరాంపురంలో మహిళలు సీఎం జగన్‌కు దిష్టి తీశారు. మేహాద్రిగెడ్డ, లక్ష్మీపురం, వరలక్ష్మీనగర్.. ఇలా ప్రతి చోటా జనం ప్రభంజనంలా కదిలివచ్చారు.

వేపగుంటలో జన వర్షం

వేపగుంటకు చేరుకున్నాక బస్సుయాత్ర.. జైత్రయాత్రలా మారింది. లక్ష్మీపురం నుంచి వేపగుంట జంక్షన్ నలువైపులా.. జయహో జగన్ అంటూ అభిమానులు.. జగనన్నా అంటూ మహిళలు.. సీఎం సీఎం అంటూ యువత కేరింతల నడుమ యాత్ర సాగింది. బస్సుపైకెక్కిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడి నుంచి గోపాలపట్నం వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులో ఎటు చూసినా జన సందోహమే కనిపించింది. మిట్ట మధ్యాహ్నం నడినెత్తిన సూరీడు భయపెట్టిస్తున్నా.. జనం కదలకుండా జగన్‌ని చూసిన తర్వాతే వెళ్లారు. వాహనాల్లో వెళ్లే వారు జగన్‌కు అభివాదం చేస్తూ సంబరపడ్డారు.

అభిమానంతో జంక్షన్ జామ్

పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం రైతు బజారు వద్ద మధ్యాహ్నం 1.15 గంటలకు లంచ్ విరామం తీసుకున్నారు. సాయంత్రం 3.30 గంటలకు మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో మొదలైంది. మేమంతా సిద్ధం కటౌట్లతో ప్రజలు సీఎం రాకకోసం ఎదురు చూశారు. బీఆర్‌టీఎస్ రోడ్డుతో పాటు రెండు వైపులా రహదారులు, దుకాణాల వద్ద సంక్షేమ ప్రదాతను చూసేందుకు పోటీ పడ్డారు. బస్సు వెంట నడుస్తూ ముందుకు సాగారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. అప్పటివరకు భయపెట్టిన ఎండవేడి నుంచి ఉపశమనం దక్కడంతో జనం మరింతగా పోటెత్తారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ వినూత్నంగా సీఎం జగన్‌కు స్వాగతం పలికారు. కరాసాలో క్రేన్ ద్వారా భారీ కటౌట్‌ను గాల్లో ఉంచుతూ సీఎంకు స్వాగతించారు.

'ఉత్తరం' ఉప్పొంగింది

ఉత్తర నియోజకవర్గంలోకి రాగానే జన ప్రభంజనం వెల్లువెత్తింది. ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం వరకూ మానవహారంలా జనం రోడ్డుకిరువైపులా బారులు తీరి.. ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. బస్సుపైకెక్కి సుమారు 4 కిలోమీటర్ల మేర ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ అభివాదం చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు తీసుకొచ్చినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ యువత ప్లకార్డులతో కృతజ్ఞతలు తెలిపింది. 2019లో ప్రజా సంకల్పయాత్ర సందర్భంగా కంచరపాలెం మెట్టు వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన బహిరంగ సభ రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు అదే తరహాలో కంచరపాలెం మెట్టు కిక్కిరిసిపోయింది. మూడు వైపులా దారులన్నీ జనంతో నిండిపోయాయి. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఆధ్వర్యంలో 101 గుమ్మడికాయలతో సీఎం జగన్‌కు దిష్టి తీశారు.

'దక్షిణం' దద్దరిల్లింది

తాటిచెట్లపాలెం మీదుగా దక్షిణ నియోజకవర్గంలోని రైల్వే న్యూకాలనీలోకి బస్సుయాత్ర అడుగుపెట్టింది. సీఎం జగన్ రాకతో వెల్లువలా తరలివచ్చిన ప్రజలతో దక్షిణం దద్దరిల్లిపోయింది. జై జగన్ నినాదాలు మిన్నంటాయి. దొండపర్తి జంక్షన్ నుంచి ప్రజలకు సీఎం జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డప్పువాయిద్యాలతో దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సీఎంకు స్వాగతం పలికారు. అక్కయ్యపాలెం మీదుగా సత్యం జంక్షన్, మద్దిలపాలెం మీదుగా సాగిన యాత్రలో అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు.

తూర్పులో జనసాగరం

తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. వాహనమిత్రతో లబ్ధి పొందిన



పినగాడి వద్ద సీఎం జగన్ అభివాదం

సుమారు 500 మంది ఆటోడ్రైవర్లు సీఎం జగన్‌పై అభిమానాన్ని చాటుకుంటూ 'ఆటో హారం'తో స్వాగతం చెప్పారు. బాణసంచా మిరుమిట్ల మధ్య తూర్పులో యాత్ర వైభవంగా సాగింది. ఇసుకతోట, ఎంవీపీ కాలనీ, హనుమంతువాక, ఆరిలోవ ప్రాంతాల్లో ఎటు చూసినా జగన్ నామస్మరణే వినిపించింది. ముఖ్యమంత్రిని చూసేందుకు కుటుంబాలతో కలిసి ప్రజలు రోడ్లపైకి వచ్చి.. మురిసిపోయారు.

భీమిలి నియోజకవర్గంలో రాత్రి బస

హనుమంతువాక మీదుగా విశాఖ వ్యాలీ జంక్షన్, జూపార్క్, మధురవాడ ఎండాడ వరకు బస్సు యాత్ర సాగింది. వైఎస్ రాజశేఖర రెడ్డి క్రికెట్ స్టేడియం సమీపంలో రాత్రి బస పాయింట్‌కు చేరుకుంది. ఇక్కడ భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. వేలాదిగా తరలివచ్చిన జనం సంక్షేమ సారథిపై పూల వర్షం కురిపించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేసేలా కార్యనిర్వాహక రాజధానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్ సార్.. మళ్లీ మీరే రావాలి.. అంటూ ముక్త కంఠంతో నినదించారు. ఎంపీ అభ్యర్థులు బొత్స ఝాన్సీ, బూడి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ గొలగాని హరివెంకటకుమారితో పాటు పార్టీ నేతలు బస్సు యాత్రలో పాల్గొన్నారు.



అన్నొచ్చిండు : వేపగుంట వద్ద సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో యువత కేరింత



కంచరపాలెం వద్ద బస్సు యాత్రలో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, బొత్స సత్యనారాయణ, ఝాన్సీ, ఎంవీవీ, ఆడారి ఆనంద్, కేకే రాజు, మేయర్ హరి వెంకట కుమారి



అదిగో అన్న : అక్కయ్యపాలెం వద్ద సీఎం జగన్‌మోహన్ రెడ్డిని చూసి ప్రజల్లో ఉత్సాహం

నేనున్నానని..







దివ్యాంగ బాలుడికి భరోసా ఇస్తున్న సీఎం జగన్, బాధితుడి సమస్య వింటూ.. దివ్యాంగ సోదరులకు అండగా..

అదే ఆప్యాయత





అమ్మా.. అంతా కుశలమేనా : మహిళలతో మాట్లాడుతున్న సీఎం జగన్

ఆటోగ్రాఫ్..



చిన్నారికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న సీఎం జగన్

స్వీట్ మెమొరీ



సీఎంతో సెల్ఫీ తీసుకుని మురిసిపోతున్న ఓ కుటుంబం

వైఎస్సార్ సీపీలో చేరికలు

సాక్షి, విశాఖపట్నం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నాయకులతో పాటు పలువురు ప్రముఖులు వైఎస్సార్ సీపీలో చేరారు. పెందుర్తి నియోజకవర్గం చిన్నయపాలెం నైట్ స్టే పాయింట్ వద్ద ఆదివారం ఈ చేరికలు జరిగాయి. జనసేన సీనియర్ నేత, 2019లో ఆ పార్టీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన గంపల గిరిధర్, జనసేన నాయకులు జి.శ్రీజ, ధనుష్‌తో పాటు మరో సీనియర్ నేత మూగి శ్రీనివాస్ పార్టీలో చేరారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన జనసేన సీనియర్ నాయకుడు, ఫెడరేషన్ ఆఫ్ ఏపీ అండ్ టీఎస్ ఎఫ్‌సీఆర్‌ఏ ఎన్‌జీవోస్ చైర్మన్, విద్యావేత్త అలీవర్ రాజు రాయ్‌తో పాటు శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణ కుమార్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు, వుడా మాజీ డైరెక్టర్ డి.భారతి, టీడీపీ యువజన విభాగం నేతలు చరణ్, సందీప్, కిరణ్మయి, దాసు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి సురేష్, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ సీఎం వైఎస్ జగన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


సీఎం జగన్ సమక్షంలో పార్టీలో చేరిన భీమిలి నియోజకవర్గం జనసేన సీనియర్ నేత, ఫెడరేషన్ ఆఫ్ ఏపీ అండ్ టీఎస్ ఎఫ్ సీ ఆర్ ఏ ఎన్జీవోస్ చైర్మన్, విద్యావేత్త అలీవర్ రాజు రాయ్


జనసేన సీనియర్ నేత మూగి శ్రీనివాస్


కంచర్ల సందీప్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్


కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి సురేష్


శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణకుమార్



టీడీపీ యువజన విభాగం నేతలు చరణ్, కిరణ్మయి, దాసు, యువజన నేతలు


జగమంత ఆనందం


అదిగో జగనన్న..


సీఎం జగన్ కోసం ఎదురు చూస్తున్న జనం


కలశాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న ప్రయాణికులు

విశాఖ నగరి.. అభిమాన ఝరి

మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా విశాఖ నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వాడవాడలా జనం నీరాజనం పలికారు. దారి పొడవునా ఘన స్వాగతం చెప్పారు. సంక్షేమాభివృద్ధి విధాతా.. జయహో అంటూ నినదించారు. సబ్బవరం మండలంలోని చిన్నయ్యపాలెం నుంచి జనజాతర ప్రారంభమై.. విశాఖ నడిబొడ్డుకు చేరే కొద్దీ సముద్రంలా ఉప్పొంగింది. జై జగన్ నామస్మరణతో మార్మోగింది.


వేపగుంట జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పరవశించిన జనం

వినతులు.. భరోసా

అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు సహాయం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇసుకతోట కూడలి వద్ద వినతి పత్రాలు అందజేశారు. పరిశీలించి సహకారం అందిస్తామని వారికి సీఎం భరోసా ఇచ్చారు. ఎంవీపీ కాలనీకి చెందిన పి.శివకుమార్‌కు కిడ్నీ మార్పిడి జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు.

- గోపాలపట్నంలో ఉంటున్న గండెం ధర్మరాజు పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆయనకు మెరుగైన వైద్యం కోసం సహకారం అందించాలని కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు.
- పండిట్ల జశ్వంత్(16) కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని, అందుకు ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రం అందజేశారు.
- పి.దక్షిత(17)కు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స జరిగిందని, మరో ఆపరేషన్ చేయాల్సి ఉందని, సహాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.
- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలని పార్వతమ్మ(50) అనే మహిళ వినతి పత్రం అందజేశారు.


జై జగన్.. జోహార్ వైఎస్సార్


అమ్మ ఒడి ప్రదాతకు జేజేలు


సీఎం జగన్‌కు హారతి ఇస్తున్న మహిళలు


జగనన్న జాతరలో సాంస్కృతిక సంబరం

సీఎం జగన్ గొప్ప నేత



మాది విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం. ఉపాధి నిమిత్తం సబ్బవరంలోని ఓ స్వీట్ దుకాణంలో పని చేస్తున్నాను. మా కుమార్తె హరిత చర్మ వ్యాధితో బాధపడుతోంది. గత నెల 7న అనకాపల్లి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి సమస్య వివరించాం. ఆయన చాలా సానుకూలంగా స్పందించి మాకు భరోసా ఇచ్చారు. పాపకు వైద్యం చేయించడంతో పాటు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ ఆనందంతో సబ్బవరం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు పాపతో కలిసి మళ్లీ వచ్చాను. దీంతో సీఎం గారు మమ్మల్ని గుర్తించి పాపను దగ్గరికి తీసుకుని భరోసా కల్పించారు. అనకాపల్లి డీఆర్వోకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన గొప్ప మానవత్వం ఉన్న నేత. ఆయనకు రుణపడి ఉంటాం. – ఇదదానరి కృష్ణ, సబ్బవరం

కాలుష్య నిర్మూలనకు సహకరించాలి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్ : కాలుష్య నిర్మూలనకు ప్రజలు చేయిచేయి కలిపి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ కోరారు. వరల్డ్ ఎర్త్ డే (ప్రపంచ భూమి దినోత్సవం) స్ఫూర్తిగా విశాఖ నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలన్నారు. ప్రపంచమంతా ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే థీమ్‌తో ఈ భూమిని పరిరక్షించుకునేందుకు ఎర్త్ డే వేడుక జరుపుకుంటుందన్నారు. మన సుందర విశాఖ నగరాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని సంపూర్ణంగా నిర్మూలించేలా జీవీఎంసీ అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. **వివరాలిలా..**

- సంత్రగచ్చి–ఎస్ఎంవీ బెంగళూరు(08845) స్పెషల్ రైలు ప్రతి శుక్రవారం సంత్రగచ్చిలో రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 9.02 గంటలకు బయలుదేరి ఆదివారాల్లో తెల్లవారు 2 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు–సంత్రగచ్చి(08846) స్పెషల్ ఎస్ఎంవీ బెంగళూరులో ప్రతి ఆదివారం తెల్లవారు 3.15 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడ చేరుకుని.. అక్కడి నుంచి 8.57 గంటలకు బయలుదేరి సోమవారాల్లో ఉదయం 10.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్లు జూన్ 28 వరకు నడుస్తాయి.
- కోయంబత్తూర్–బరౌని (06059) స్పెషల్ రైలు ప్రతి మంగళవారం కోయంబత్తూర్‌లో ఉదయం 11.50 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరి మూడో రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 25 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో బరౌని–కోయంబత్తూర్(06060) స్పెషల్ బరౌనిలో ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి మూడో రోజు తెల్లవారు 3.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి నాలుగో రోజు తెల్లవారు 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

లారీ ఢీకొని మహిళ మృతి


రామలక్ష్మి (ఫైల్)

కూర్మన్నపాలెం: లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు.. గాజువాకలోని శ్రామికనగర్‌కు చెందిన గంటా తాతయ్యనాయుడు ఫ్యాబ్రికేషన్ వర్క్ చేస్తూ భార్య రామలక్ష్మి(47) ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. శనివారం బంధువుల వివాహానికి బుచ్చెయ్యపేట మండలం వెళ్లి ఆదివారం ఉదయం తమ ద్విచక్రవాహనంపై గాజువాక తిరుగు ప్రయాణమయ్యారు. సరిగ్గా డొంకాడ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని కుడివైపుగా బలంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయారు. వెనుక కూర్చున్న రామలక్ష్మిని కొంత దూరం లారీ ఈడ్చుకు పోవడంతో ఆమెకు తల మీద బలమైన గాయంతో పాటు ఎడమ చెయ్యి, కుడికాలు విరిగిపోయి అక్కడిక్కడే మృతి చెందింది. తాతయ్యనాయుడుకు కూడా బలమైన గాయాలయ్యాయి. దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో 'ముళ్లకప్ప'


రుషికొండ బీచ్‌కు కొట్టుకుని వచ్చిన పుగు ఫిష్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో ఆదివారం ఉదయం తీరానికి పుగు చేప కొట్టుకొచ్చింది. దీని చుట్టూ ముల్లులు ఉంటాయి. దీనిని మత్స్యకారులు వాడుక భాషలో ముళ్లకప్ప అంటారు. తెల్లరంగులో ఉన్న పుగు చేపలు అరుదుగా ఉంటాయని ఇక్కడ మత్స్యకారులు తెలుపుతున్నారు.

సింహగిరిపై ఘనంగా పండిత సదస్సు

- అప్పన్న వైభవాన్ని కీర్తించిన పండితులు
- వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చిన నృసింహుడు


వేణుగోపాలస్వామి అలంకారంలో గోవిందరాజస్వామి


దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్‌ను సత్కరిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి


పండిత సదస్సు నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం పండిత సదస్సును ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామిగా అలంకరించి, దేవేరులతో కలిపి వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని పలు ప్రధాన దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులు స్వామి వారి వైభవాన్ని చాటిచెప్పారు. అనంతరం దేవస్థానం తరఫున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి వారిని సత్కరించారు. రాష్ట్ర దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వర్ణకవచ అలంకారంలో అప్పన్న

కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆదివారం స్వర్ణకవచ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ గురువారం మాత్రమే చేసే స్వర్ణ కవచ అలంకారాన్ని, ఏటా వార్షిక కల్యాణోత్సవాల్లో పండిత సదస్యం రోజు కూడా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం 7 గంటల నుంచి కల్యాణ ఉత్సవమూర్తుల చెంతన వైదిక సదస్యాన్ని ఘనంగా నిర్వహించారు.

భారత్‌ను విశ్వగురువుగా నిలుపుదాం

- ఏఐసీటీఈ చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్
- ఘనంగా భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం


అవార్డులు ప్రదానం చేస్తున్న బుద్ధ చంద్రశేఖర్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఏయూ క్యాంపస్: భారతదేశాన్ని విశ్వగురువుగా నిలుపుదామని ఏఐసీటీఈ చీఫ్ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. భారత్‌ని సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దడంలో ఆచార్యుల పాత్ర కీలకమన్నారు. భవిష్యత్తులో ఆర్ట్స్, సైన్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలు, కళాశాలలు, పాఠశాలల్లో సైతం ఈ అవార్డులను ప్రదానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్య, పరిశోధన రంగాలలో విశేష సేవలు అందించిన ఆచార్యులు, యాజమాన్యాలు, ప్లేస్‌మెంట్ అధికారులు, పరిశోధకులను సత్కరించారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యువతకు నైపుణ్యాలే అవకాశాలు సృష్టిస్తాయన్నారు. ఆచార్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించాలని చెప్పారు.

బ్రెయిన్ ఓ విజన్ సంస్థ సీఈవో డి.గణేష్ నాగు మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 320 మంది ఆచార్యులు, కళాశాలల నిర్వాహకులు, ప్లేస్‌మెంట్ అధికారులు, పరిశోధకులను సత్కరించామన్నారు. విద్యార్థులే ఓటింగ్ విధానంలో వీరిని ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సరీస్ నౌ సంస్థ డైరెక్టర్ జి.భాస్కర్, సిటో హెల్త్ కేర్ సంస్థ సీఈవో ఎస్.వి.కృష్ణ ప్రసాద్, ధనేకు సంస్థ ప్రతినిధి డి.కె.ఆర్.కె.రవిప్రసాద్ పాల్గొన్నారు.

భారత్ వైపు ప్రపంచం చూపు


విగ్రహ ప్రాణప్రతిష్ఠలో పాల్గొన్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు

కొమ్మాది: భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని, అందుకే ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. సాగర్‌నగర్‌లో శ్రీమోగదారమ్మ, మహాలక్ష్మి పద్మాలయంలో శ్రీలక్ష్మీ దుర్గ, సరస్వతి దేవతామూర్తులకు ప్రాణప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ప్రాణప్రతిష్ఠలో వెంకయ్య దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర తీరాన హైందవ సంస్కృతి ప్రకారం హోమం, యజ్ఞం నిర్వహించి దేవతా మూర్తులకు విగ్రహ ప్రతిష్ఠ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. మతం వ్యక్తిగతమని, జీవన విధానంలో నిత్యం ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం ఉత్తమమన్నారు. ఇటువంటి మహత్తర కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూరపనేని లక్ష్మీప్రసాద్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మెట్ల పైనుంచి జారిపడి యువకుడి మృతి

పీఎం పాలెం : ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి జారిపడిన ఓ యువకుడు మృతి చెందినట్లు పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబధించి సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ. మారికవలస ఐటీ సెజ్ నారాయణ కళాశాలలో మహారాష్ట్రకు చెందిన గణపత్ భవిష్కర్ పనిస్తున్నాడు. అతని కుమారుడు రోహిత్ శంకర్ భవిష్కర్ ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో అదే నారాయణ కళాశాల మెట్ల పైనుంచి దిగుతూ కిందకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలిలోనే మృతిచెందాడు. సచివాలయ వీఆర్వో పూర్ణ సాయి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని మానసిక స్థితి కూడా సక్రమంగా లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.